www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 19 నవంబర్ 2025
5
వైఎస్ఆర్




లేబర్ డైరెక్టర్‌కు సన్మానం

ప్రజాశక్తి - కడప అర్బన్ : మసాపేట 26వ డివిజన్ టిడిపి ఇన్‌ఛార్జి చవలముడి శంకర్ ఆధ్వర్యంలో రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ డైరెక్టర్ లోమడ చంద్రమోహన్‌రెడ్డిని గజమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. మసాపేట టిడిపి కార్యాలయంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కృషి చేసిన వారికి నామినేటెడ్ పదవులు వస్తాయని తెలిపారు. అందుకు లోమడ చంద్రమోహన్‌రెడ్డి నిదర్శనమని చెప్పారు. రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీకి పనిచేసిన ప్రతి ఒక్కరికి నామినేటెడ్ పదవుల ద్వారా సముచిత స్థానం కల్పిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్నారై కువైట్ టిడిపి ఉపాధ్యక్షులు షేక్.రహమతుల్లా, టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి కొమ్మలపాటి సుబ్బరాయుడు, 28 డివిజన్ ఇన్‌ఛార్జి గాజుల పల్లి రాఘవేంద్ర, బిసి టిడిపి నాయకులు చంద్రశేఖర్, బూత్ కన్వీనర్ యు.వీరయ్య, 157 బూత్ ఇన్‌ఛార్జి పెయ్యాల ప్రణవతి, జిల్లా తెలుగు మహిళ ఉపాధ్యక్షులు మౌనిక, తెలుగు మహిళ జయశ్రీ, శ్రీకాంత్, పూర్ణ పాల్గొన్నారు

'కొప్పర్తి' పైప్‌లైన్‌కు మోక్షమేదీ?

- జిఎన్‌ఎస్‌ఎస్ కేటాయింపుల 'హామీ'
- కదలని 'ఉక్కు' సర్వరాయసాగర్ పనులు
- కాగితాల్లోనే తెలుగుగంగ లీకేజ్ ప్రతిపాదనలు
- విశాఖ సదస్సులో జిల్లాకు పెట్టుబడులేవీ
- నేడు పెండ్లిమర్రికి ముఖ్యమంత్రి చంద్రబాబు రాక





ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప జిల్లా అపరిష్కృత సమస్యలకు నిలయంగా మారింది. కొప్పర్తి పారిశ్రామికవాడకు నీటి సరఫరా పైప్‌లైన్ పనులు పురోగతి ప్రశ్నార్థకం మొదలుకుని కదలని ఉక్కు పరిశ్రమ, జిఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2 పనులకు రూ.వెయ్యి కోట్లు సర్వరాయసాగర్, బ్రహ్మసాగర్ లైనింగ్ లీకేజీ, గండికోట, పైడిపాలెం, సోమశిల సాగునీటి ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం వరకు నిట్టూర్చాల్సిన పరిస్థితి నెలకొంది. ఎపిహెచ్ రహదారులకు కేటాయించిన భూములకు పరిహారం చెల్లింపుల సమస్య తోడైంది. విశాఖపట్నంలో భాగస్వామ్య సదస్సులో పెట్టుబడుల వరద పారినట్లు ప్రచారం చేసుకుంటున్న సంగతి తెలిసిందే. రూ.13 లక్షల కోట్ల పెట్టుబడుల్లో కడప, అన్నమయ్య జిల్లాలకు ఎటువంటి పాత్ర లేకపోవడం విమర్శలకు వినిపిస్తోంది. దేశంలోని భూగర్భ బేసిన్‌లో తనదైన ప్రత్యేకత కలిగిన జిల్లాలో పారిశ్రామిక ప్రగతి వెలవెలబోయింది. 2024 సార్వత్రిక ఎన్నికల అనం తరం అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు నాయకుల దాడులు, ప్రతిదాడుల నేపథ్యంలో జిల్లాకు వచ్చిన పారిశ్రామిక సంస్థలకు రాజకీయ చిత్తశుద్ధి కొరవడిన ఫలితంగా సాకారానికి నోచుకోవడం లేదు. బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు కమలాపురం నియోజక వర్గంలోని పెండ్లిమర్రి మండల పర్యటన నేపథ్యంలో కథనం...

జిల్లా ప్రగతి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న సామెతను తలపిస్తోంది. వ్యవసాయ, సాగునీటి, పారిశ్రామిక రంగాల పురోగతి ప్రశ్నార్థకంగా మారింది. 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో సాగునీటి ప్రాజెక్టులను పట్టాలెక్కిస్తానన్న హామీ అమలుకు ఆమడదూరంలో నిలిచింది. హామీల అమలుకుతోడు ఈ ఏడాది మేలో కడపలో నిర్వహించిన మహానాడులో జిఎన్‌ఎస్‌ఎస్ కెనాల్ పనులకు రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తానన్న హామీ అమలుకు నోచుకోలేదు. మహానాడు ముగిసిన 12 రోజుల వ్యవధిలో జమ్మలమడుగు మండల పరిధిలోని సున్నపురాళ్లపల్లి-పెద్దండ్లూరు గ్రామాల సమీపంలో ఉక్కు పరిశ్రమ పనులు మొదలుపెడతామని ఇచ్చిన హామీ అమలుకు నోచుకోవడం లేదు. ఆగస్టు 12 ముగిసిన అనంతరం పత్రికల కథనాలు గుర్తు చేసిన నేపథ్యంలో బలవంతంగా కంపెనీ ప్రతినిధులు, కలెక్టర్ హడావుడి చేయడం మినహా ఆశించిన పురోగతి కనిపించని పరిస్థితి. నాలుగు నెలలు గడుస్తున్నా పూర్తి స్థాయిలో పట్టాలకు ఎక్కిన దాఖలాల్లేవు. ముఖ్యమంత్రి కడప జిల్లా పర్యటన ఉందనే వాతావరణంలో పెండ్లిమర్రిలో ఆగ్రోస్, ఇతర స్టాళ్ల పరిశీలన, అన్నదాత సుఖీభవ కార్యక్రమ ప్రారంభోత్సవం పేరిట జిల్లా వ్యవసాయశాఖ హడావుడి చేయడం మినహా ప్రజలకు ఇచ్చిన హామీ అమలు చేయడం ద్వారా మెప్పించే పనులు చేపట్టడం లేదనే వాదన వినిపిస్తోంది. కొప్పర్తి పారిశ్రామికవాడకు రూ.150 కోట్లతో సాగుతున్న పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. గండికోట నిర్వాసితులకు రూ.2.50 లక్షలు పెండింగ్ పరిహారం ఆరేళ్లుగా అమలుకు నోచుకోలేదు. సర్వరాయసాగర్, బ్రహ్మసాగర్ లీకేజీలకు ముగింపు ఎప్పుడో తెలియడం లేదు. ప్రభుత్వం ఈ నెల 14, 15వ తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించిన ప్రపంచ పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సులో కడప జిల్లాలోని వైఎస్ఆర్ ఎలక్ట్రానిక్ క్లస్టర్ ఉన్నప్పటికీ ఒక్క సెమికాన్ పరిశ్రమ మొదలుకుని ఎటువంటి పరిశ్రమలు రాకపోవడంపై రాష్ట్ర పాలకుల్ని జిల్లా ప్రజానీకం నిలదీస్తున్న పరిస్థితి కనిపిస్తోంది.

సిఎం పర్యటన వివరాలు..

కడప : బుధవారం మధ్యాహ్నం పెండ్లిమర్రి మండలం వెల్లటూరు జడ్‌పి హై స్కూల్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 1.25 గంటలకు ప్రజా ప్రతినిధుల తో మాట్లాడుతారు. రోడ్డు మార్గాన బయలుదేరి మ.1.30 గంటలకు వెల్లటూరులోని చేరుకుంటారు. రైతులతో ముఖాముఖి నిర్వహిస్తారు. అనంతరం రోడ్డు మార్గాన ప్రజా వేదిక చేరుకుని సాయంత్రం 4.00 గంటల వరకు అన్నదాత సుఖీభవ.. పిఎం కిసాన్ కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రజావేదిక నుంచి చిన్న దాసరిపల్లికి చేరుకుంటారు. అక్కడే వ్యవసాయ క్షేత్రాల పరిశీలంచి రైతులతో ముఖాముఖి నిర్వహిస్తారు. తరువాత వెల్లటూరులోని పార్టీ కేడర్ సమావేశానికి హాజరవుతారు. రోడ్డు మర్గాన బయలుదేరి సాయంత్రం కడప విమానాశ్రయం చేరుకుని గన్నవరానికి వెళ్తారు.

'పద్మావతి' అరాచకాలను అరికట్టాలి : సిఐటియు



కోటిరెడ్డి సర్కిల్ వద్ద ఆందోళన చేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప జిజిహెచ్‌లో తొలగించిన సూపర్‌వైజర్లను తిరిగి విధులకు తీసుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో కోటిరెడ్డి సర్కిల్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప జిజిహెచ్‌లో 18 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న సూపర్‌వైజర్లను అకారణంగా తొలగించడంతో అనేక రూపాలలో నిరసన తెలియజేశామని చెప్పారు. జిజిహెచ్ ప్రారంభం నుంచి శానిటేషన్ విభాగంలో సూపర్‌వైజర్లుగా కొనసాగుతున్న వారిని కొత్తగా వచ్చిన పద్మావతి ఏజెన్సీ సూపర్‌వైజర్లను తొలగించడం అన్యాయమన్నారు. ఎవరినైనా తొలగించాలంటే ముందుగా నోటీసులు ఇవ్వాలని, తర్వాత వాటిపైన వారు సంతృప్తి చెందకుండా ఉంటే వారిని తొలగించవచ్చని పేర్కొన్నారు. వయోపరిమితి 50 సంవత్సరాలు ఉండాలని చెబుతున్నారని ఏజెన్సీ వారు చెబుతున్నారని, పాతవారిని తొలగించాలని ఏ నోటిఫికేషన్లలో ఉండదని చెప్పారు. ఉద్దేశపూర్వకంగానే సూపర్‌వైజర్లను తొలగించారని పేర్కొన్నారు. తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకునేంతవరకు సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు నిర్వహిస్తూనే ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షుడు చంద్రారెడ్డి, నాయకులు రామ్మోహన్, రామకృష్ణ కార్యాలయ కార్యదర్శి ఉదయ్, శీను, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రవి, అధ్యక్షుడు రాహుల్, రిమ్స్ సూపర్‌వైజర్లు సుభాషిణి, ఆదామ్, వెంకటేష్, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధి పట్ల సిఎం దృష్టి సారించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్


మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్

ప్రజాశక్తి - కడప అర్బన్

అధికార, ప్రతిపక్ష నేతల ఆధిపత్య పోరులో కడప జిల్లా అభివృద్ధి కుంటుపడుతుందని తక్షణమే జిల్లాకు వస్తున్న ముఖ్యమంత్రి నిధులు విడుదల చేసి అభివృద్ధి పట్ల దృష్టి సారించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి 19 నెలలైనా ఇప్పటికి జిల్లాలో దశాబ్దాల తరబడి పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు, కడప ఉక్కు పూర్తి చేసే బాధ్యత తెలుగుదేశం పార్టీదే అని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు విస్మరించారని తెలిపారు. జిల్లాలో తెలుగుదేశం పార్టీ నిర్వహించిన మహా నాడులో ముఖ్యమంత్రి హామీల వర్షం కురిపించారని, నేటికీ ఏ ఒక్కటి అమలు కాలేదని విమర్శించారు. కృష్ణా జలాల ద్వారా జిల్లాలో ప్రాజెక్టులు నింపుతున్నారని పంట కాలవల నిర్మాణం చేపట్టకపోవడంతో నీరు వృథా అవుతున్నాయని తక్షణమే పూర్తయిన ప్రాజెక్టుల కింద పంటకాలవలు పూర్తిచేసి ఆయకట్టును అభివృద్ధి చేయకపోతే ప్రజాధనం వృధా అవుతుందన్నారు. గాలేరు - నగరి, తెలుగంగ బ్రహ్మంసాగర్ కింద పంట కాల్వలను పూర్తి చేసి రైతన్నలను ఆదుకోవాలని తెలిపారు. జిల్లాలో తుపాను కారణంగా భారీ వర్షాలతో నష్టపోయిన ఉల్లి, మొక్కజొన్న, వరి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. జిల్లాకు వస్తున్న ముఖ్యమంత్రి వీటిపై దృష్టి సారించి జిల్లాను అభివృద్ధి పథంలో పయనించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగిరి రెడ్డి, కె. శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా కేంద్ర గ్రంథాలయం సంస్థ 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మంగళవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎలిశెట్టి పవన్ కుమార్ క్విజ్ పోటీలు ప్రారంభిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్విజ్ పోటీలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. పోటీలకు న్యాయనిర్ణేతగా ఉపాధ్యాయులు ఎ.డి.దేవదత్తము, సి.మంజులవాణి, అర్.ప్రతాపుడు, పుష్పరాజు వ్యవహరించారు. ఈ చదరంగం పోటీలు జూనియర్స్ 10 గ్రూప్స్ , సీనియర్ 8 గ్రూప్స్ పాల్గొన్నాయని చెప్పారు. బుధవారం ఉదయం 9.00 గంటలకు మహిళా దినోత్సవం సందర్భంగా కార్యక్రమాన్ని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల కడపలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 20న నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల, కడప లో వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సమావేశంలో బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందని తెలిపారు. **చింతకొమ్మదిన్నె :** స్థానిక జడ్‌పి హైస్కూల్‌లో హెచ్‌ఎం శోభారాణి ఆధ్వర్యంలో మంగళవారం 8,9,10 తరగతి విద్యార్థులకు 'గ్రంథాలయాల అవశ్యకత' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈనెల 20న గ్రంథాలయ వారోత్సవాల ముగింపు రోజున విజేతలకు బహుమతులు అందజేస్తామని గ్రంథాలయాధికారి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగాధర్, రెడ్డెన్న ఇన్‌ఛార్జి హెచ్‌ఎం రామాంజులరెడ్డి, శ్రీధర్ మూర్తి, గ్రంథాలయ అధికారి పి. ఇబ్రహీం, విద్యార్థులు పాల్గొన్నారు.

నారాయణ పాఠశాలలో ఎన్‌పిఎల్

ప్రజాశక్తి - బద్వేలు : స్థానిక తెలుగుగంగ కాలనీలోని నారాయణ ఒలంపియాడ్ స్కూల్‌లో ఎన్‌పిఎల్ (నారాయణ ప్రీమియర్ లీగ్) వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు క్రీడా దుస్తులు ధరించి వివిధ విభాగాలలో నిర్వహించిన క్రీడా పోటీల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ వివి నరసింహారెడ్డి, పాఠశాల ఎజిఎం శ్రీనివాసులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి శాంతికి చిహ్నమైన పావురాలను స్వేచ్ఛగా గాలిలోకి ఎగురవేశారు. క్రీడా పోటీలకు ప్రారంభానికి గుర్తుగా కాగడాను వెలిగించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్లు వినోద్, ఇందిరా, అకాడమిక్ డీన్ శ్రీకాంత్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్స్ రఘురామిరెడ్డి, రాజేశ్వరి, భారతి, ఎఒ శ్రీనివాసులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధి చేసుకోవాలి

ప్రజాశక్తి - కలసపాడు

రబీ సీజన్‌లో సాగు చేసే రైతులు ముందుగా విత్తన శుద్ధి చేయాలని వ్యవసాయాధికారి అజయ్‌కముఆర్ పేర్కొన్నారు. మంగళవారం రాజుపాలెం, బ్రాహ్మణపల్లిలో పొలం పిలుస్తోందని కార్యక్రమం నిర్వహించారు. వరి పంట కోత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలిపారు. కచ్చితంగా ఈ పంటనమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. యూరియా వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయం పద్ధతులు ఆచరించి ఆరోగ్యకరమైన పంటలు పండించుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో రాజుపాలెం గ్రామ వ్యవసాయ సహాయకులు హర్షవర్ధన్, ఎపిసిఎంఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

టీచర్ రాధిక సేవలు మరువలేనివి : ఎంఇఒ

ప్రజాశక్తి-కాశినాయన

గిరిజన విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో టీచర్ రాధిక విద్యను బోధించడం మరువలేనిదని ఎంఇఒ మహమ్మద్ షఫీ అభినందించారు మండలంలోని రెడ్డి కొట్టాల ఎస్‌టి కాలనీ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత నెమళ్లదిన్నె రాధిక పనితీరు ప్రశంసనీయమని పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఎస్‌టి కాలనీ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గిరిజన విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో రాధిక పాఠ్యాంశాలను బోధించడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు ఆరోగ్యం, పరిశుభ్రతల పై అవగాహన కలిగించడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా ఎంఇఒ పాఠశాల అభివృద్ధికి పలు సూచనలు చేశారు. హెచ్‌ఎం రాధిక మాట్లాడుతూ ఎంఇఒ సూచనలు పాటించి పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

భూములకు సబ్ డివిజన్ చేయాలి

ప్రజాశక్తి - ఒంటిమిట్ట


తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

తమ భూముల వివరాలు ఆన్‌లైన్ ఎక్కించినప్పటికీ సబ్ డివిజన్ చేయలేదని, వెంటనే సడ్‌డివిజన్ చేసి పాస్‌పుస్తకాలు ఇవ్వాలని మండల పరిధిలోని మంట పంపల్లి, రామచంద్రాపురం సుగాలి తాండాకు చెందిన గ్రామస్తులు కోరారు. మంగళవారం తహశీల్దార్ దామోదర్‌రెడ్డి వారు వినతిపత్రం సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఏడోవిడత అసైన్‌మెంట్ కమిటీలో ఇచ్చిన భూములకు వెంటనే పట్టాలు ఇవ్వాలన్నారు.ప్రస్తుతం ఆ భూముల్లో రైల్వేకు సంబంధించిన కాంట్రాక్టర్లు గుడారాలు వేసుకుని పనులు చేసుకుంటున్నారని చెప్పారు. తమ భూములకు సబ్‌డివిజన్ చేసి పట్టాలిప్పించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన తహశీల్దార్ ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి ముద్దుకృష్ణారెడ్డి, బొబ్బిలి రాయుడు గ్రామస్తులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు రెండు బెంచీలు వితరణ

ప్రజాశక్తి - కడప అర్బన్


దాతలు ఎఎస్ఒ ఆనంద్, బీమా కంపెనీ మేనేజర్

వ్యవసాయ శాఖ ప్రధానమంత్రి ఫసల్ బీమా ప్రచారంలో భాగంగా ఇన్సూరెన్స్ కంపెనీతో భాగస్వామ్యం రెండు బెంచీలు వితరణగా అందజేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో వీటిని అమర్చారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ ఇన్సూరెన్స్ కంపెనీ సహకారంతో కలెక్టరేట్ వచ్చేవారు కొద్దిసేపు కూర్చుని ఎందుకు వేయించిన ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కడప కార్యాలయ ఏఎస్ఒ ఆనంద్, ఇన్సూరెన్స్ కంపెనీ మేనేజర్ వరప్రసాద్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమాలకు నిత్యావసర సరుకులు పంపిణీ


మాట్లాడుతున్న విద్యుత్ ఎస్ఇ

ప్రజాశక్తి - కడప : ఎపి ఎస్‌పిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ లోతేటి శివశంకర్ జన్మదినాన్ని పురస్కరించుకొని కడప విద్యుత్ ఉద్యోగుల సామాజిక సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కడపలోని చౌడమ్మ, పద్మావతి వెంకటేశ్వర వృద్ధాశ్రమాలకు రూ. 60 వేల విలువ చేసే నిత్యా వసర సరుకులను జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ విద్యుత్ ఉద్యోగులు తమ వృత్తి బాధ్యతలతో పాటు సమాజానికి అండగా నిలిచి చేస్తున్న సేవలు ప్రశంసనీయం అన్నారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపే సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాల పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవలకు శ్రీకారం చుట్టి, సామాజిక సేవా పథంలో విద్యుత్ ఉద్యోగులు ముందుకు సాగాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సురేష్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రమేష్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఇతర అధికారులు, సామాజిక సేవ సంఘం సభ్యులు పాల్గొని సేవా స్ఫూర్తిని మరింతగా వెలిగించారు.

భూసార పరీక్షలపై అవగాహన

ప్రజాశక్తి - గోపవరం : మండలంలోని బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో భూసార పరీక్షల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కడప భూసార పరీక్షా కేంద్రం నుంచి వచ్చిన అధికారులు డి. సాయి జ్యోతి, వై.ఎస్. విజయ భారతి విద్యార్థులకు మట్టి నమూనాలు సేకరణ విధానం, భూసార పరీక్షల ప్రాముఖ్యతను వివరించారు. ల్యాబ్‌కు పంపే నమూనాల ఎంపిక, పూరించాల్సిన వివరాలను ప్రదర్శనాత్మకంగా చెప్పి అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి విజయరావు మాట్లాడుతూ భూమి సారవంతం తెలుసుకోవడానికి భూసార పరీక్ష తప్పనిసరి అని, ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగం చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.

టెట్ అర్హత పరీక్షను రద్దు చేయాలి

ప్రజాశక్తి- కడప అర్బన్

ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు టెట్ అర్హత పరీక్ష రద్దు కోసం కృషి చేయాలని ఎస్‌టియు జిల్లా శాఖ ప్రతినిధులు కమలాపురం శాసనసభ్యులు పుత్తా కృష్ణ చైతన్యరెడ్డిని కోరారు. మంగళవారం కడప నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా 25 నుంచి 30 సంవత్సరాల సర్వీసు కలిగిన వారికి టెట్ అర్హతా పరీక్ష నిర్వహించాలనుకోవడం న్యాయం కాదని పేర్కొన్నారు. ఆ దిశగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం త్వరగా రివ్యూ పిటేషన్ వేసి ఇన్ సర్వీస్ టీచర్ల ప్రయోజనాలను కాపాడాలని కోరారు. పార్లమెంటులో రైట్ టు ఎడ్యుకేషన్ యాక్ట్-2009లోని సెక్షన్ 23 సవరణ కోసం బిల్లు ప్రవేశపెట్టేలా ప్రభుత్వ పెద్దలను ఒప్పించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోని లక్ష ఇరవై వేల మంది ఉపాధ్యాయుల సమస్యను సానుకూలంగా పరిష్కరించాలని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగం పొందిన తర్వాత 20, 30 సంవత్సరాల అనంతరం కూడా అర్హత పేరుతో పెట్టే పరీక్షలకు సిద్ధపడాలా, లేక పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు పాఠాలు బోధించాలా తెలియని అయోమయ స్థితిలో నేడు ఉపాధ్యాయులు ఉన్నారని చెప్పారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ ఈ సమస్యపై దృష్టి పెట్టాలని కోరారు. శాసనసభ సభ్యులు ఉపాధ్యాయుల అభ్యర్థనను మంత్రి దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్‌టియు అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్ రెడ్డి, పాలకొండయ్య, నాయకులు ఇలియాస్‌బాషా, బాల గంగిరెడ్డి, రామ్మోహన్, సుబ్రహ్మణ్యం, వెంకటసుబ్బయ్య, ఓబులేసు, చెన్నకేశవరెడ్డి, సుదర్శన్ రెడ్డి,మస్తాన్ బాబు, రాజేంద్ర, హరినాథ్, రాజశేఖర్, శివారెడ్డి, వాజిద్, శ్రీనివాస్ రెడ్డి, ఆనంద్ రెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు. **బద్వేలు:** 20 సంవత్సరాలు నుంచి అన్ని అర్హతలు పొంది ఉపాధ్యాయులుగా పని చేస్తున్న ఉపాధ్యాయులను ఇప్పుడు ఒక్కసారిగా టెట్ పరీక్ష రాయమని చెప్పడం చాలా విడ్డూరంగా ఉందని, వారికి టెట్‌ను మినహాయించేలా ప్రభుత్వం చర్యలు ఈసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. ఉపాధ్యాయుల సంఘాల నేతలు మంగళవారం ఎమ్మెల్యే సుధాను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస.జగన్ మోహన్ రెడ్డి సూచనలు మేరకు ఉపాధ్యాయుల పోరాటానికి న్యాయ పరంగా అన్ని రకాలుగా అండగా ఉంటామని తెలిపారు.

27 నుంచి భూమి పత్రాల పరిశీలన

ప్రజాశక్తి - గోపవరం : మండలంలోని గోపవరం గ్రామ రెవెన్యూ పొలంలో ఉన్న సర్వే నెంబరు 234కు సంబంధించిన భూమి పత్రాలను పరిశీలనను ఈనెల 27, 28, 29 తేదీలలో గ్రామస్తులు తమ పత్రాలతో స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించాలని తహశీల్దార్ త్రిభువన్‌రెడ్డి ఒక ప్రకటనలో అనంతరం తెలిపారు. కార్యక్రమం కోసం ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. సంబంధిత వ్యక్తులు నిర్ణీత తేదీల్లో తప్పనిసరిగా హాజరై తమ స్వాధీన పత్రాలను సమర్పించాలని పేర్కొన్నారు. నిర్దేశిత సమయానికి పత్రాలు సమర్పించని పక్షంలో, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆ భూమిలో ఇంటి నివాసం లేని పేద కుటుంబాలకు స్థలాలను కేటాయించే ప్రక్రియ చేపట్టనున్నామని పేర్కొన్నారు.

కడప ఎమ్మెల్యే మానసిక పరిస్థితి బాగలేదు

ప్రజాశక్తి - కడప : కడప ఎమ్మెల్యే మానసిక పరిస్థితి బాగా లేదేమో అందుకే సభ్య సమాజం తలదించుకునేలా మాట్లాడుతున్నారని వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు దేవి రెడ్డి ఆదిత్య, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్, వైసిపి మహిళ జిల్లా అధ్యక్షురాలు తెలుగు పులి వెంకటసుబ్బమ్మ, కార్పొరేటర్లు షఫీ, బసవరాజు అన్నారు. మంగళవారం మాజీ ఉప ముఖ్యమంత్రి నివాస కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వైసిపి నేతలపై విమర్శలు మానుకొని అభివృద్ధిపై దృష్టి సాధించాలని ఎమ్మెల్యేకు వారు సూచించారు. టిడిపి కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాధవి కార్యకర్తలకు దిశా, నిర్దేశం చేయకుండా వైసిపి నేతలపై విమర్శలు చేయడం ఏంటని ప్రశ్నించారు. వైసిపిపై పదేపదే అనుచిత వ్యాఖ్యలు చేయడం, గుడ్డలూడదీసి కొడతామని మాట్లాడడం సరికాదన్నారు. ఇన్నేళ్ల చరిత్రలో ఇలాంటి సంస్కృతి ఎన్నడూ చూడలేదన్నారు. విలేకరుల సమావేశంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

అడ్వెంచర్ శిబిరానికి ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు

ప్రజాశక్తి - కడప అర్బన్ : కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో ఇద్దరు ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు నేషనల్ అడ్వెంచర్ ట్రైనింగ్ క్యాంపునకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ డాక్టర్ వి.సలీం బాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు సి.పావని, కె.జాహ్నవి ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ తరపున ఈనెల 22 నుంచి డిసెంబర్ ఒకటవ తేదీ వరకు హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలోని మనాలిలో ఉన్న అటల్ బిహారీ వాజ్ పేయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ అండ్ అలైడ్ స్పోర్ట్స్ సంస్థలో నిర్వహించే నేషనల్ అడ్వెంచర్ ట్రైనింగ్ క్యాంపుకు ఎంపిక కావడం హర్షణీయమన్నారు. మనాలిలో పది రోజుల అడ్వెంచర్ క్యాంపు జాతీయ సేవా సమితి రీజనల్ డైరెక్టర్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తారని చెప్పారు. క్యాంపు వల్ల విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు పెంపొందింపబడతాయని, విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతారని చెప్పారు. క్రమశిక్షణ, టీం వర్క్ వంటి లక్షణాలు విద్యార్థుల్లో పెంపొందింపబడతాయని చెప్పారు. ఈ సందర్భంగా పావని, జాహ్నవిలను ప్రోత్సహించిన ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ జి. విజయలక్ష్మి దేవి, డాక్టర్ పి.శశి దేవి ని ప్రిన్సిపల్ అభినందించారు. యోగి వేమన యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్. వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ తమ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ పరిధిలో మొత్తం 10 మంది వాలంటీర్లు అడ్వెంచర్ క్యాంపుకు ఎంపికయ్యారని, వీరితోపాటు కంటింజెంట్ లీడర్ గా ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కె.లలిత హాజరవుతున్నారని తెలిపారు.

ముగిసిన సర్టిఫికెట్ కోర్సు

ప్రజాశక్తి - కడప


సర్టిఫికెట్లతో విద్యార్థులు

కడప ప్రభుత్వ పురుషుల కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో ఒక నెలపాటు నిర్వహించిన 'టాలీ ప్రైమ్ విత్ జిఎస్‌టి' సర్టిఫికేట్ కోర్సు మంగళవారం విజయవంతంగా ముగిసింది. విద్యార్థుల కోసం ప్రాక్టికల్‌గా రూపొందించిన ఈ కోర్సులో శిక్షణ అత్యంత ప్రయోజనకరంగా సాగింది. ముగింపు కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ అకౌంటింగ్, ట్యాక్సేషన్ రంగాల్లో ట్యాలి ప్రైమ్, జిఎస్‌టి ప్రాధాన్యాన్ని వివరించారు. ఒక నెలపాటు నేర్చుకున్న నైపుణ్యాలు విద్యార్థుల భవిష్యత్ ఉద్యోగ అవకాశాలను పెంపొందిస్తాయని అన్నారు. కామర్స్ విభాగాధిపతి డాక్టర్ టి. మధుసూదన మాట్లాడుతూ పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ఇలాంటి కోర్సులు విద్యార్థులను ప్రాక్టికల్‌గా తీర్చిదిద్దుతున్నాయని తెలిపారు. కోర్సు కో-ఆర్డినేటర్ డాక్టర్ అంకాల నాగరాజు శిక్షణలో కవర్ చేసిన అంశాలను వివరించారు. తరువాత విద్యార్థులకు సర్టిఫి కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కామర్స్ విభాగంలోని అధ్యాపకులు డాక్టర్ నీలయ్య, డాక్టర్ కృష్ణవేణి, రెడ్డిబాషా, లావణ్య, మంజు భార్గవి పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-కడప అర్బన్ : ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు 'నషా ముక్త్ భారత్ అభియాన్' ప్రారంభించి ఐదేళ్లు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, కడప నగరంలోని ఉక్కాయపల్లి సాయికృప నర్సింగ్ కళాశాలలో మంగళవారం నర్సింగ్ విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలు, ఆరోగ్య సమస్యలు గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా వారిచేత ప్రతిజ్ఞ చేయించారు. వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ కృష్ణ కిషోర్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీవిద్య, అధ్యాపకులు, విద్యార్థులు సుమారు 500 మంది, డిడి ఎసి సిబ్బంది, నార్కోటిక్ సెల్ నుంచి మల్లయ్య, ఈగల్ సిబ్బంది అయ్యూబ్ ఖాన్, గురుశేఖర్ పాల్గొన్నారు. **బద్వేలు :** నషాముక్త్ భారత్ అభియాన్‌పై మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది ప్రత్యేక ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బద్వేల్ పట్టణం మత్తు లేని ప్రాంతంగా మార్చేందుకు తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి సమాజ నిర్మాణంలో సానుకూల శక్తిగా మారాలని పిలుపునిచ్చారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

ప్రజలకు మెరుగైన సేవలు అందించండి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని శాసనమండలి సభ్యుడు రాంగోపాల్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని పలు వార్డు సచివాలయాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, సిబ్బంది హాజరు.. పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రజల ఫిర్యాదులు, అభ్యర్థనలను తక్షణమే పరిష్కరించేలా చూడాలన్నారు. ప్రజా సేవలు మరింత సమర్థవంతంగా సాగేందుకు అవసరమైన మార్పులను ప్రభుత్వ స్థాయిలో ప్రతిపాదించనున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందించేలా చూడాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిదే అన్నారు. కార్యక్రమంలో కడప పార్లమెంట్ కార్యదర్శి బొజ్జ మైసూరారెడ్డి, గంగిరెడ్డి, జ్ఞానేశ్వర్ నాయుడు పాల్గొన్నారు.

21న పులివెందులలో 'విద్యుత్ అదాలత్'

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఈనెల 21న పులివెందుల విద్యుత్ డివిజన్ కార్యాలయంలో విద్యుత్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిఇ ప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు నిర్వహిస్తున్నామన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి తొండూరు, సింహాద్రిపురం, లింగాల, వేముల, వేంపల్లి, చక్రాయపేట మండలాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలన్నారు. వెంటనే పరిష్కారం చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్

సిఐటియు మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

డిసెంబర్ 31నుంచి 2026 జనవరి 4వరకు విశాఖపట్నంలో జరుగు సిఐటియు మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ పిలుపునిచ్చారు. స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో వై.నరేంద్ర అధ్యక్షతన సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మనోహర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని తెలిపారు. కార్మికులు ప్రాణాలు తెగించి సాధించుకున్న కార్మిక చట్టాలను మార్పు చేయడం దుర్మార్గమన్నారు. ఈ పరిస్థితుల్లో సిఐటియు ఆల్ ఇండియా మహాసభలకు ప్రత్యేకత ప్రాధాన్యత ఉందన్నారు. కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యల మీద రాజీలేని పోరాటాలు చేయాలన్నారు.

ఆటో వర్కర్స్ యూనియన్ స్టాండ్ల కన్వీనింగ్ కమిటీ ఏర్పాటు

ఆటో వర్కర్స్ యూనియన్ స్టాండ్‌ల కన్వీనింగ్ కమిటీలను ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా వై.నరేంద్ర, కో-కన్వీనర్లుగా దస్తగిరి, రమేష్, అబ్రహం, మహేంద్రను ఎన్నుకున్నారు. సమావేశంలో సిఐటియు పట్టణ గౌరవ అధ్యక్షులు గోపాల్ దాస్ ఏసుదాస్, పట్టణ కార్యదర్శి విజయ్, ఉపాధ్యక్షులు వినయ్ కుమార్, నరేంద్ర, ఆదాము, అబ్రహం, పట్టణంలోని వేపరాల, దొమ్మరనంద్యాల, మైలవరం, గూడెంచెరువు ఆటో కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

గ్రామపంచాయతీకి సంబంధించిన నీటి పన్ను, ఇంటి పన్ను దాదాపు రూ. 2లక్షలు దుర్వినియోగం చేసిన పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాసులుపై చర్యలు తీసుకోవాలని మంగళవారం అన్నవరం గ్రామ సర్పంచ్ ఆలూరు పీరయ్య డిప్యూటీ ఎంపిడిఒ హరినాథ్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్యదర్శి అన్నవరం, టిఓ పల్లి గ్రామాలకు సంబంధించిన రూ.2 లక్షల వరకు పన్ను నగదును వ్యక్తిగత అవసరాలకు వాడుకొని దుర్వినియోగం చేశాడన్నారు. సర్పంచ్‌గా ఈ నగదు గురించి పలుమార్లు అడిగినప్పటికీ పంచాయతీ కార్యదర్శి నుండి ఎలాంటి సమాధానం లేదన్నారు. అధికారులు విచారించి పంచాయతీ సొమ్మును వెంటనే వసూలు చేయాలన్నారు. లేనిపక్షంలో పూర్తి ఆధారాలతో ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్తామని తెలిపారు.

బహుజనులు రాజ్యాధికారం వైపు పయనించాలి

ప్రజాశక్తి -కాశినాయన

మండలంలోని కత్తెరగండ్ల శివాలయం వద్ద మంగళవారం యాదవుల వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు ముఖ్యఅతిథిగా బోడె రామచంద్ర యాదవ్ హాజరై మాట్లాడారు. బహుజనులు రాజ్యాధికారం వైపు పయనించినప్పుడే మన జాతి బాగుపడుతుందని ఆయన అన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పుడు బహుజనులు అనగదొక్కబడుతున్నారే తప్ప రాజ్యాధికారం వైపు ఏనాడు కూడా రానివ్వలేదని తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల నుంచి బడుగు బలహీన వర్గాల వారిని జతపరచుకొని యాదవులందరూ ఐకమత్యంతో పోటీ చేయాలన్నారు. కొందరు స్వార్థ రాజకీయ నాయకులు మనల్ని కొందరిని చీల్చి అణగదొక్కేందుకు ప్రయత్నం చేస్తున్నారని, ఇవన్నీ గమనిస్తూ యాదవ కులమంతా ఏకమై రాజ్యాధికారంలో ముందుండాలని పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబంలోని పిల్లలందరూ ఉన్నత చదువులు చదివి గొప్పవారై రాజ్యాధికారం వైపు మన పిల్లలను పయనింపచేయాలన్నారు. కార్యక్రమంలో కుర్ర బాలచెన్నయ్య, రెడ్డి కొట్టాల సర్పంచ్ తిరుపతయ్య, బిసి నాయకులు మురళీకృష్ణ, దామోదరం, కలసపాడు ఎంపిపి నారాయణ యాదవ్, మాజీ ఎంపిపి ఈశ్వరమ్మ, బిసి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

44 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలోని ఆయా ప్రాంతాల్లో హోటళ్లలో వంట చేసేందుకు వాడుతున్న 44 డొమెస్టిక్ సిలిండర్లను మంగళవారం సివిల్ సప్లయ్ డిప్యూటీ తహశీల్దార్ సుధీర్ పట్టుకున్నారు. విఆర్‌ఒలతో కలిసి ఆయన తనిఖీలు చేపట్టారు. టీ దుకాణాలు, హోటళ్లల్లో కమర్షియల్‌గా డొమెస్టిక్ సిలిండర్లు వాడుతున్న వాటిని స్వాధీనం చేసుకుని, తహశీల్దార్ కార్యాలయానికి తరలించారు. హోటళ్ల యాజమానులపై కేసులు నమోదు చేసినట్లు సుధీర్ తెలిపారు. టీ, హోటళ్లల్లో కమర్షియల్ సిలిండర్లు మాత్రమే వాడాలని ఆయన సూచించారు. లేనిచో కేసులు నమోదు చేస్తామని సుధీర్ హెచ్చరించారు.



తహశీల్దార్ కార్యాలయానికి తరలించిన సిలిండర్లు

ఆవుల సంచారం.. రాకపోకలకు అంతరాయం

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రజలు - సమస్యను పరిష్కరించాలని వేడుకోలు



ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలో ఆవుల సంచారం వాహనదారులను, ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. పట్టణంలో ప్రతి రోడ్డు, ప్రతి వీధిలో ఆవులు గుంపులుగా దర్శనమిస్తున్నాయి. రోడ్లు, వీధుల్లో అడ్డంగా తిరుగుతున్నాయి. ఎక్కడపడితే అక్కడ పడుకుంటున్నాయి. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయాన్ని కలిగిస్తున్నాయి. ప్రధానంగా కడప, పులివెందుల, గండి రోడ్డులో, మెయిన్ బజార్, బ్యాంకు సర్కిల్ ప్రాంతాలతోపాటు ఆయా వీధుల్లో కూడా పెద్ద సంఖ్యలో రోడ్డుకు అడ్డంగా ఉంటూ పాదాచారులు, వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నాయి. పులివెందుల రోడ్డులో దుకాణాల వద్ద పెట్టిన వాహనాలను ఆవులు కింద పడేస్తుడడం, వాటి సీటు కవర్లు, బ్యాగ్‌లను చించడం చేస్తున్నాయి. ఎవరైన పొరపాటున తమ వాహనాల బ్యాగ్‌ల్లో వస్తువులు, సరుకులు, తినుబండారాలు ఉంటే పీకేసి, రోడ్డుపై వెదజల్లుతుంటాయి. ఆవులు ద్విచక్ర వాహన దారులపై, పాదచారులపై దాడి చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఇలాంటి ఘటనలను తరచూ చోటు చేసుకుంటూ ప్రజలు, వాహనదారులను తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నాయి. కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు ఇతర వ్యర్థాలను రోడ్డు పక్కన పడేయడం వల్ల పశువులు వాటిని తినేందుకు వచ్చి వాహనాల రాక పోకలకు అంతరాయం కలిగిస్తున్నాయి. దీనిపై ప్రజలు పలుమార్లు అధి కారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. పలు మార్లు పశువుల యజమానులకు హెచ్చరికలు జారీ చేసినా అడ్డుకట్ట పడ లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా మండలస్థాయి అధికారులు స్పందించి వ్యాపారులు వ్యర్థాలను దుకాణాల సమీపంలో రోడ్డుపై వేయకుండా చూడాలని ప్రజలు సూచిస్తున్నారు. ఆవుల యజమానులతో చర్చించి వాటిని పట్టణానికి దూరంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'స్వామిత్వ'లో అభ్యంతరాలుంటే తెలపాలి

ప్రజాశక్తి - చాపాడు

స్వామిత్వ పథకం ద్వారా గ్రామాల్లో ప్రజలకు సంబంధించిన స్థలాలు, గృహాలు ఆన్‌లైన్ చేయడంలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తేవాలని డివిజనల్ అభివృద్ధి అధికారి రామాంజనేయులు సూచించారు. కుచ్చుపాప గ్రామంలో మంగళవారం స్వామిత్వ పథకంపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో గ్రామాల్లో స్థలాలు, గృహాలకు ప్రత్యేక హక్కును సూచించే ధ్రువీకరణ పత్రాలు లేవన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం సర్వే నిర్వహించి అసలైన హక్కు దారులను గుర్తిస్తుందన్నారు. ఆస్తులకు సంబంధించి హక్కు పత్రాన్ని మంజూరు చేస్తామన్నారు. కుచ్చుపాప గ్రామంలో సర్వే పూర్తి కావడంతో గ్రామసభ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి టి.లక్ష్మమయ్య, గ్రామ పంచాయతీ సర్పంచ్ చింతకుంట సుబ్బారెడ్డి, డిప్యూటీ ఎంపిడిఒ హరినాథ్, ఉప సర్పంచ్ పాలూరు రామసుబ్బారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, గ్రామ ప్రజలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అభ్యంతరాల్లేని వారి హక్కు పత్రాలను అందజేస్తున్న అధికారులు

పశువైద్య సిబ్బంది.. సమయానికి రాక ఇబ్బంది..

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వ శాఖల అధికారుల తీరు ఇష్టారాజ్యంగా కొన సాగుతోంది. సమయానికి విధులకు రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. ప్రభుత్వ అధికారుల తీరును స్వయంగా ఎమ్మెల్యే తప్పు పడుతూ హెచ్చరికలు జారీ చేస్తున్నా, అధికారుల్లో మాత్రం మార్పు కని పించడం లేదు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని సుంకేసుల పశు వైద్య కేంద్ర సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావడంలేదని పలువురు గ్రామ స్తులు మంగళవారం తీవ్రంగా ఆరోపించారు. సమయానికి కార్యా లయానికి రావాల్సి ఉండగా ఎంతకీ రాలేదని పడగాపులు కాయాల్సి వస్తోం దని వాపో యారు. పశువుల చికిత్స కోసం ఆసుపత్రికి వస్తే సిబ్బంది అందు బాటులో లేరని పశు పోషకులు వాపోయారు. ప్రభుత్వాధికారుల తీరు, కార్యా లయాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో క్షేత్రస్థాయిలో సిబ్బంది ఇష్టానుసారంగా విధు లకు హాజరవుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కలెక్టర్ ఉద్యోగులపై కఠినచర్యలు తీసుకొని సిబ్బంది సకాలంలో హాజరయ్యేలా చూడాలని పశువుల యజమానులు కోరుతున్నారు.



సమయానికి తెరచుకోని సుంకేసుల పశువైద్య కేంద్రం

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



వైద్యులకు సూచనలిస్తున్న జోనల్ మలేరియా అధికారి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ నిర్మల్ అలెగ్జాండర్ తెలిపారు. మండలంలోని చిలమకూరు ప్రభుత్వ ఆసు పత్రిని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో చాలా రోజులపాటు నీటినిల్వలు లేకుండా చూడాలన్నారు. దోమల వల్ల వచ్చే జబ్బుల గురించి సరైన అవగాహన ప్రజలలో వచ్చినప్పుడే వారి ఆరోగ్యం బాగుంటుందన్నారు. దోమలను నివారిస్తే మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా జ్వరాలను తగ్గించవచ్చునని తెలిపారు. తమ పరిధిలోని గ్రామాల్లో ప్రజలకు పరిశుభ్రత పట్ల అవగాహన కల్పించాలని చిలమకూరు పీహెచ్సీ డాక్టర్లు సాయిచరితరెడ్డి, గణేష్‌రెడ్డికి సూచించారు. ముఖ్యంగా గర్భిణులన్న ప్రాంతాల్లో మలేరియా ప్రబలకుండా శానిటైజేషన్ చేయించాలని స్థానిక వైద్యులకు సూచించారు. స్థానిక ల్యాబ్ టెక్నీషియన్ సెలవులో ఉన్నందున ఆ పనులు పెండింగ్‌లో ఉన్నాయని వైద్యులు తెలి పారు. పిహెచ్‌సిలో రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో స్థానిక వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ముద్దనూరు : సీజనల్ వ్యాదుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ నిర్మల్ అలెగ్జాండర్ వైద్య సిబ్బందికి సూచించారు. స్థానిక పిఎచ్‌సిని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నిర్మల్ అలెగ్జాండర్ మాట్లాడుతూ వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధులు పట్ల జాగ్రతగా ఉండాలని సూచించారు. ఫ్రైడే డ్రైడే, వెక్టర్ కంట్రోల్ హైజిన్ యాప్ నమోదు తప్పక నమోదు చేయాలని ఆదేశించారు. కాన్పుల గది, వాక్సిన్ గది, పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో సిఎచ్ఓ ప్రసాద్ యాదవ్, ఆరోగ్య విస్తరణ అధికాలు శ్రీనివాస్‌రెడ్డి, నిత్యపూజయ్య, సబ్ యూనిట్ అధికారి లక్ష్మయ్య, సిబ్బంది జగదీష్, రామారావు, జయమ్మ పాల్గొన్నారు.



పిహెచ్‌సిని తనిఖీ చేస్తున్న డాక్టర్ నిర్మల్ అలెగ్జాండర్

భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలి



రైతులకు జింక్, జిప్సం పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

భూసార పరీక్ష ఫలితాల ఆధా రంగా ఎరువులు వాడాలని జిల్లా రైతు శిక్షణ కేంద్రం పరిశోధన కేంద్రం వ్యవసాయ శాఖ ఎడి అశోక్‌రెడ్డి పేర్కొ న్నారు. మండలంలోని అచ్చవెల్లి గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఎఓ చెన్నారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఎడి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా రైతు శిక్షణ కేంద్రం ఎడి అశోక్‌రెడ్డి విచ్చేశారు. ఎడి అశోక్‌రెడ్డి మాట్లాడుతూ రైతులందరూ తప్పనిసరిగా మట్టి నమూనాలను పరీక్ష చేయించుకోవాలన్నారు. ఫలితాల అనుగుణంగా ఎరువులు వాడాలన్నారు. విచక్షణా రహితంగా ఎరువులు వాడకం ద్వారా పెట్టుబడులు పెరిగి, భూమి సారవంతం తగ్గుతుందని వివరించారు. స్థానిక వ్యవసాయ శాఖ ఎడి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం రబీ సీజన్‌కు 50 శాతం రాయితీతో వివిధ రకాల క్రిమిసంహారక మందులు, జింకు, జిప్సం, వేప నూనెను అందుబాటులో ఉంచామన్నారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. క్రిమిసంహారక మందులు, జింకు, జిప్సం కావలసిన రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతులు, రైతు సేవ కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్న గ్రంథాలయ అధికారి

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ ఉర్దూ హైస్కూల్‌లో 6 వతరగతి నుండి 10వ తరగతి విద్యార్థులకు స్వచ్ఛాంధ్ర అవస్యకత గురించి వ్యాసరచన పోటీలు నిర్వహించామన్నారు. ప్రతిరోజు ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. వారోత్సవాల ముగింపు సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు. గ్రంథాలయాన్ని క్రమం తప్పకుండా విద్యార్థులు సందర్శించాలన్నారు. అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఉర్దూ హైస్కూల్ హెడ్మాస్టర్ కమలనాథ్ శర్మ, ఉపాధ్యాయులు ఫైరోజ్ అహ్మద్, అజీజ్ అహ్మద్, విద్యార్థులు పాల్గొన్నారు.



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు, రైతులు

కందిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

కంది పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ముద్దనూరు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు మోహన్‌రెడ్డి సూచించారు. ముద్దనూరు, డిఎన్ పల్లెలో మంగళవారం ఎడిఎ ఆధ్వర్యంలో ఎఓ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ, ఎఓ మాట్లాడుతూ రసం పీల్చే పురుగుల ఉధృతి నివారణకు పసుపు రంగు జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వేప నూనె 5ఎంఎల్ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. పచ్చదోమ నివారణకు అసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వేప నూనె తప్పకుండా ప్రతిసారి పిచికారీ చేసుకోవాలని సూచించారు. లద్దెపురుగు నివారణకు ఇమా మెక్టిన్ బెంజెట్ 0.4 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. బెట్ట నివారణకు యూరియా 20 గ్రాములు లేదా 19.19.19.అనే ఎరువును 10 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో ఆత్మ బిటిఎం రవికుమార్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రామసుధ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాచమల్లు ప్రసాద్‌రెడ్డి

రిలే నిరాహార దీక్షలు విరమణ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు ఎగ్జిబిషన్ నిర్వాహకులు మున్సిపాలిటీకి చెల్లించాల్సిన రూ.88 లక్షలకుగానూ కోర్టు ఉత్తర్వులతో రూ.54 లక్షలు చెల్లించి మిగిలిన రూ.34 లక్షలకు కోర్టు ఈనెల 26వ తేదీ వరకు చెల్లించవచ్చని సమయం ఇచ్చిందని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఇందుకోసం తాము 14 రోజులుగా కొనసాగించిన దీక్షా శిబిరాన్ని తాత్కాలికంగా ఎత్తివేస్తున్నామని తెలిపారు. మిగిలిన డబ్బులు చెల్లించని పక్షంలో మళ్లీ దీక్షా శిబిరాన్ని కొనసాగిస్తామని ఆయన తెలిపారు. దీక్షా శిబిరాన్ని ఎత్తివేస్తున్న సందర్భంగా మంగళవారం రాచమల్లు విలేకరులతో మాట్లాడుతూ స్థానిక శాసన సభ్యులు వరదరాజులరెడ్డి, ఆయన కుమారుడు కొండారెడ్డి అండ చూసుకొని ఎగ్జిబిషన్ నిర్వాహకులు తాము చెల్లించాల్సిన మొత్తాన్ని ఎగ్గొట్టేందుకు చూశారని ఆరోపించారు. ఇందుకు మున్సిపల్ కమిషనర్ కూడా సహకరించారన్నారు. ఈ కుట్రతో ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని తాము భావించి 14 రోజులుగా మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్షలు చేయడంతోపాటు కోర్టును ఆశ్రయించామని ఆయన గుర్తు చేశారు. ప్రజాధనాన్ని కాపాడే విషయంలో వైసిపి నాయకులు ముఖ్యంగా మహిళ నాయకులు చూపిన పోరాటపటిమకు రాచమల్లు ధన్యవాదాలు తెలిపారు.

దురుసుగా ప్రవర్తిస్తే పోలీసుల దృష్టికి తేవాలి

సింహాద్రిపురం : మహిళలు, బాలికలపై ఎవరైనా దురుసుగా ప్రవర్తిస్తే పోలీసులకు తెలపాలని ఎస్ఐ రవికుమార్ తెలిపారు. మండలంలోని నిడివెలగల కస్తూర్బా పాఠశాలలో మంగళవారం ఆయన బాలికల, మహిళల చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బాలికలు, మహిళల సంరక్షణ కోసం ప్రభుత్వం అనేక చట్టాలను తెచ్చిందన్నారు. మహిళలు, బాలికలపై దురుసుగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ గురుదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.